కథ

# ఏ'కాకి'చప్పుడు

డా॥ వి. పోతన్న



"కావ్.... కావ్... కావ్"... టెంకాయ చెట్టు మట్ట పైన కూర్చొని 'కాకి' అరచింది. ఇంటి ముందుర మంచం మీద కూర్చున్న వెంకట్రాదికి ఆ అరుపు పిలుపులా వినిపించింది.

"నీది ఎంత అదృష్టమే కాకమ్మా! మాట్లాడుతుండావూ?" అని కాకిని పలకరించాడు. కాకి అరుపు అలాగే కొనసాగటంతో ఇంట్లో వంట చేస్తున్న సుకన్య చేతిలో ఉన్న గరిటెను అట్లే పట్టుకొని బయటికి దూసుకొని వచ్చింది.

"హేయ్... హేయ్... ఉస్.. ఉస్... పీడ... పీడ. ఇంత ఉదయమే దీనికేమొచ్చిందో! చావు అరువు అరుస్తోంది. గోల గోల చేస్తోంది" అంటూ కాకిని అదిలించింది.

సుకన్య మాటలకు కాకి బెదరలేదు. అదరలేదు. అరుపు ఆపలేదు. సన్నగా, నున్నగా ఉన్న మెడను గుండ్రంగా తిప్పుతూ, ముందుకూ వెనక్కీ మెడ చాపుతూ గరిటె మీద అతుక్కొని ఉన్న మెతుకుల వైపు చూసింది. కావ్... కావ్ మాటను కొనసాగించింది.

''తూ.... తూ! దర్రిదం... దరిద్రం. ఇది మీదికి ఎక్కడ వస్తుందో!'' అనుకుంటూ చేతిలో ఉన్న గరిటెను క్రిందపెట్టి ప్రహరీగోడకు ఆనుకొని ఉన్న బూజు దులిపే కట్టె తీసుకొని కాకిని అదిలించింది. మనుషుల మధ్యనే తిరిగే కాకికి ఆ అదిలింపు కొత్తేమీ అనిపించలేదు. నేల మీద రాలిన మెతుకుల వైపు ఆశగా చూస్తూ అట్టే అరిచింది.

''ఈ కాకులు మిలటరీలో చేరితో సైనికులకు తుపాకీలతో పని ఉండదు. వీటి అరుపులు విని శత్రువులు భయంతో పారిపోతారు. కర్రను కూడా లెక్క చెయ్యకుండా నా వైపు ఎలా చూస్తోందో చూడు'' అంటూ చేతిలో ఉన్న కట్టెను క్రింద పడేసి, పూల కుండీ దగ్గర ఉన్న గులకరాయి తీసుకొని విసిరింది. చూసింది కాకి. కూర్చున్నచోట విడచి ఇంకొక 'మట్ట' పైకి ఎగిరి కూర్చుంది. 'గురి' తప్పించుకుంది.

''ఏంటికి కొడతావులేమ్మా. అదే పోతుంది గానీ. యా ఊరి కాకో! ఈ ఊరి కొచ్చింది. పాపం. ఆకలైతాం డాదేమో! అరత్తా ఉండాది'' – అన్నాడు వెంకటాద్రి.

''ఈ కాకిని నువ్వే పెంచినట్లు మాట్లాడుతున్నావే! దాని అరుపు నీకు రోత అనిపించలేదా? సంగీతం లాగా వినిపిస్తోందా?'' – కాకి మీద కోపాన్ని వెంకటాద్రి మీద చూపింది సుకన్య.

''నేను పెంచకపోయినా! అది ఏంటికి అరుత్తాందో తెలుసు తల్లీ. ఒక కాకి అరిత్తే .... తోటి కాకులన్నీ అడుగుతాయి. ఏమి కట్ట మొచ్చిందీ? అని 'గూడు' నుంచి కాకిపిల్ల జారి కింద పడితే... కాకులన్నీ ఆ పిల్ల చుట్టూ చేరుతాయి. నొప్పి తగిలిందా? అని అడుగుతాయి. కలిసి మెలిసి బతక టానికీ, కట్టసుఖాలు పంచుకోవ టానికీ కాకులు సరతుగా కనిపిత్తాయి తల్లీ'' – తన మనసుకు కలిగిన కష్టాన్ని నర్మ గర్భంగా చెప్పాడు వెంకటాద్రి. కాకి అరుపులకు వెంకటాద్రి చెప్పిన వివరణ సుకన్యకు చిర్రెత్తించింది.

''అబ్బో! కాకి శాస్త్రాన్ని తమరే రాసినట్లు చెబుతున్నారే'' – దీర్ఘం తీస్తూ ఎగతాళిగా అంది.

''అబ్బబ్బా! ఆపండి మీ గోల. ఇంత ప్రొద్దున్నే ఈ పోట్లాడుకోవటం ఏంటి? మీరు 'మామ కోడలు' కాదు. అత్తాకోడళ్ళు'' – రైతు బజారు నుంచి కూరగాయలు తెస్తూ గేటు దగ్గర నుంచే అన్నాడు శీనయ్య.

''నేను మాట్లు మరిసిపోయి శాన్నాళ్ళయిండాది నాయనా. కాకి అరిత్తే మనూరి 'మనిసి' పిలిసినట్లని పించీ – దాంతో మాట్లాడుతాంటే... ! నీ భారియే నాతో కొట్లాటకి దిగింది'' – గుండె బాధను శ్వాసతో కలుపుకొని వెంకటాద్రి చెప్పాడు. సుకన్యకు కోపం నషాళానికి అంటింది. ''ఆ... నాకేమీ పనిలేకా నీతో పోట్లాడటానికి వచ్చాను'' – అంటూ ఇంకేదో అనటానికి ప్రయత్నిస్తుంటే ''మమ్మీ... రా! మమ్మీ. నాకు స్కూల్‌కి టైమ్ అవుతుందీ. త్వరగా రా మమ్మీ'' అని సుధీర్ గోలగోల చేయటంతో సుకన్య ఇంట్లోకి వెళ్ళింది భర్త శీనయ్యను 'పద'నుగా చూస్తూ. భార్య చూపులోని 'కరకు'ను చూసి... ''ఏంది నాయనా. నీకు ఎన్నిసార్లు చెప్పాలా? తిని ఊరకే పడి ఉండక ఈ మాటలేంటి?'' తండ్రిని కసిరించుకొని శీనయ్య కూడా ఇంట్లోకి వెళ్ళాడు. వెంకటాద్రి మౌనంగా ఉండి పోయాడు.

టెంకాయ చెట్టు మీద ఉన్న కాకి నేలమీదికి రివ్వున వచ్చింది. గరిటె నుంచి రాలిపడిన మెతుకులు తినసాగింది. అది చూసే ''ఈ మెతుకుల కోసరమే గదా నేను కూడా రావటం. దీనికీ నాకీ తేడా లేదు. యా ఊరి కాకో! నా మాదిరే ఈటికి వలస వచ్చింది'' – వెంకట్రాది నోట్లోనే గొణుక్కున్నాడు. కాకి మెతుకులు తినేసి ప్రక్క ఇంటి ముందర ఉన్న మామిడి చెట్టు మీద వాలింది.

'గంట' ఎనిమిది దాటింది. ''బాయ్! తాతయ్యా'' అంటూ పుస్తకాల 'లోడు'ను వీపు మీద మోసుకుంటూ 'నిండు లారీలాగా' సుధీర్ వెళ్ళిపోయాడు. సుధీర్ వెళ్ళిన కాసేపటికి సుకన్య, శీనయ్యలు కూడా ఆఫీసుకు బయలుదేరారు. వెళ్ళేముందు ''డైనింగ్ టేబుల్ మీద ఇడ్లీలు ఉన్నాయి పెట్టుకొని తిను'' అంది సుకన్య. ''టిఫెన్ తినకుండా అట్లే ఉండేవే నాయనా'' అన్నాడు శీనయ్య. ఇద్దరి మాటలూ విన్న వెంకటాద్రి 'ఆ' అనలేదూ... 'ఊ' అనలేదు.''మనసు నిమ్మలంగా ఉంటే గదా! ఒంటికి తిండి సయించేది'' – అనే భావనతో కొడుకు కోడలు వైపు చూశాడు. ఆ చూపులు తెలిసినవే కాబట్టీ ఏమీ మాట్లాడకుండా భార్యాభర్తలు ఆఫీసుకు పోయారు.

కొడుకు కోడలు వెళ్ళగానే వెంకటాద్రి మెల్లగా లేచాడు. ఇంటివెనక ప్రహరీగోడ దగ్గరకు నడిచాడు. గోడ మూల కుప్పగా ఉన్న ఎండిన ఆకులు తొలగించాడు. అక్కడ దాచిన 'బీడీలూ – అగ్గిపెట్టె' తీసుకున్నాడు. మంచం దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. అగ్గిపుల్ల వెలిగించి బీడీ ముట్టించుకున్నాడు.

బీడీ పొగ గుండెల్లోకి తృప్తిగా పీల్చసాగాడు. పొగవచ్చి గుండెను కొట్టడంతో దగ్గు వచ్చింది. ''కయ్... కయ్'' అన్నాడు.

ఆ దగ్గును లెక్క చెయ్యకుండా బీడి తాగుతూ ఉంటే... ''వంకాయలు, బెండకాయలు, టమాట కాయలు'' – అంటూ తోపుడి బండివాడు ఇంటి ముందుకు వచ్చాడు. ఆ పిలుపు వినీ పక్కింటి దీప్తి బయటకి వస్తూ... ''ఏమి తాతా! బీడి జోరుగా తాగుతున్నావు. కొడుకూ, కోడలు ఇంట్లో లేరనా?'' అంది. వెంకట్రాది మాట్లాడలేదు. కూరగాయలు తీసుకొని దీప్తి తిరిగి వచ్చేసరికీ... వెంకట్రాది బీడి తాగటం పూర్తి చేసి మౌనిలా కూర్చున్నాడు.

''టిఫిన్ తిన్నావా తాతా?'' అడిగింది దీప్తి. యథాలాపంగా

''ఊ.... ఊ హూ'' అన్నాడు వెంకట్రాది.

''ఏమి తాత! మాట్లాడవు? ఒంట్లో బాగా లేదా?'' కాస్త జాలిగ అడిగింది.

''ఒంట్లో బాగానే ఉంది. మనసుకే రోగ మొచ్చింది'' గొంతులో నరాలకు మాత్రమే విన పడేటట్లు మాట్లాడుతూ ఇంట్లోకి వెళ్ళాడు. డైనింగ్ టేబుల్ మీద ఉన్న పాత్ర చూశాడు. దాని మూత తీశాడు. మూడు ఇడ్లీలు కనిపించాయి. ఒకటి తీసుకొని ప్లేట్‌లో పెట్టుకున్నాడు. పక్కనే ఉన్న చట్నీ వేసుకున్నాడు. సగం ఇడ్లీ తిన్నాడు. మిగిలిన సగం పడవేయటం ఇష్టం లేక ఇంటి ముందున్న కాంపౌండ్ గోడ మీద పెట్టాడు. కాకి మళ్ళీ వస్తే తింటుందని. హాల్లోకి వచ్చాడు. సోఫాలో కూర్చున్నాడు. అటూ–ఇటూ కదిలాడు. ఎదురుగా ఉన్న టీ.వి. భూతం లాగ కనిపించింది. ఆ భూతంలో 'ఏ దెయ్యం' కనిపిస్తుందో అని పక్కనే ఉన్న రిమోట్ తీసుకున్నాడు. అందులో ఉన్న గుర్తుల్లో ఏది నొక్కాలో తెలియక ఏదో! ఒకటి నొక్కాడు. సెడ్డీలూ – మిడ్డీలతో అంగాంగ ప్రదర్శన చేస్తున్న బొమ్మలు కనిపించాయి. ''తూ... తూ'' అన్నాడు. మళ్ళీ ఏదో సంఖ్యను నొక్కాడు. బొమ్మలు మాయమైనాయి. కాసేపు సోఫాలో అలాగే కూర్చున్నాడు. హాలు నాలుగు దిక్కులకు చూశాడు. టి.వి. పక్కన ఉన్న రేడియో కనిపించింది. హరి కథ, బుర్ర కథో! ఏమైనా వస్తాయేమో అనుకున్నాడు. రేడియో ఆన్ చేశాడు. ఖాళీ డ్రమ్మును రాళ్ళతో విసిరి కొట్టినట్లు సినిమా పాట వినిపించింది. వెంటనే ఆఫ్ చేశాడు. సోఫాలో నుంచి పైకి లేచాడు. ఇంటి ముందుకు వచ్చాడు. రోడ్డు వైపు చూశాడు. బస్సులు కనిపించాయి. కార్లు కనిపించాయి. మోటారు సైకిళ్ళు, ఆటోలూ శరవేగంతో దూసుకుపోవటం చూశాడు. కాలి నడకనక వెళ్ళే జనాన్ని చూశాడు. వెళ్ళే వాళ్ళను 'నిలిపి' మాట్లాడాలనిపించింది. వెంటనే ''నాకు మాట్లు రావు గదా! నేను మాట్లాడ కూడదు గదా'' అనే ఆంక్షలు గుర్తుకు వచ్చి ఆగిపోయాడు. రోడ్డు మీద పరిగెత్తిపోదామా! అనుకున్నాడు. పరిగెత్తితే పిచ్చి పట్టిందని జనం వెంట పడతారేమో అనుకున్నాడు. మనసు పరుగెత్తమని చెప్పినా! దేహం ఒప్పు కోదులే – అనుకున్నాడు.

''ఓరి భగవంతుడా! నాలాంటోడు ముసలి అయ్యేదాకా బతక్కూడదు. వయసులో ఉన్నట్లే సచ్చిపోవల్ల'' అనుకున్నాడు. రోడ్డు వైపు సాగుతున్న చూపులు ఇంటి వైపు మళ్ళించుకొని వెల్లగా నడిచాడు. ముందు రూమ్‌లో ఉన్న మంచం మీద నడుం వాల్చాడు. చూపులు ఇంటి కప్పుకు తగిలించాడు. కళ్ళ కొలుకుల నుంచి నాలుగు చుక్కలు అటు రెండూ – ఇటు రెండు చెక్కిళ్ళ మీద పరుగెత్తాయి. నిట్టూర్పులు కొనసాగాయి. అవి మనసును వేడెక్కించాయి. పలచని కన్నీళ్ళతో వేడెక్కిన మనసును తడుపుకొని గతాన్ని పలకరించాడు.

'గంట' ఎనిమిది దాటింది. ''బాయ్! తాతయ్యా'' అంటూ పుస్తకాల 'లోడు'ను వీపు మీద మోసుకుంటూ 'నిండు లారీలాగా' సుధీర్ వెళ్ళిపోయాడు. సుధీర్ వెళ్ళిన కాసేపటికి సుకన్య, శీనయ్యలు కూడా ఆఫీసుకు బయలుదేరారు. వెళ్ళేముందు ''డైనింగ్ టేబుల్ మీద ఇడ్లీలు ఉన్నాయి పెట్టుకొని తిను'' అంది సుకన్య. ''టిఫెన్ తినకుండా అట్లే ఉండేవే నాయనా'' అన్నాడు శీనయ్య. ఇద్దరి మాటలూ విన్న వెంకటాద్రి 'ఆ' అనలేదూ... 'ఊ' అనలేదు.''మనసు నిమ్మలంగా ఉంటే గదా! ఒంటికి తిండి సయించేది'' – అనే భావనతో కొడుకు కోడలు వైపు చూశాడు.

***

కోట్ల సంఖ్యలో ఉన్న 'ఆకలి బతుకుల్లో' భారత పౌరుడిగా వెంకటాద్రి కూడా పుట్టాడు. 'ఆకలి వాసన'లో వందల ఋతువులు కరిగిపోయాయి. కూలి జీవితంలో ఎన్నో ఏళ్ళు సమసి పోయినాయి. అమ్మా నాన్నలు ఆస్తి ఇవ్వకపోయినా ఒక 'ఆశ' మాత్రం వెంకటాద్రికి వరంగా ఇచ్చారు. తండ్రి మరణిస్తూ పక్కనే ఉన్న నాలుగేళ్ళ మనువడు శీనయ్యను దగ్గరకు తీసుకొని ''ఒర్యా! ఎంగిటాద్రీ! అచ్చరాలు రాక మన బతుకులు ఇట్లా తగలబడి పోయినాయి. నా మనువడికి నాలుగు గీతలు నేర్పించు'' అన్నాడు. తల్లి చనిపోతూ పదేళ్ళ శీనయ్యను చూస్తూ ''బిడ్డా ఎంగిటాద్రీ! నా మనువన్ని 'కలకటేరున్ని' సెయ్యాల్ల సూడు'' అంది. తల్లిదండ్రుల ఆశను వెంకటాద్రి గుండెలో నిలుపుకున్నాడు. చెమట చుక్కతో శీనయ్య చదువును పెంచి పెద్ద చేశాడు. కలెక్టర్‌ను చెయ్యలేక పోయినా, ఓ పాటి ఉద్యోగస్తున్ని చేశాడు. కొడుకు శీనయ్య చెప్పా పెట్టకుండా ప్రేమించిన అమ్మాయిని పెళ్ళిచేసుకొని ఇంటికి వచ్చినప్పుడు నొప్పి పడకుండా ''సల్లగ బతకండి'' అని దీవించాడు. ''మీ అమ్మే గాని బతికుంటే ఎంత సంతోష పడిందేదో!'' అని కన్నీళ్ళను పంచెతో తుడుచుకున్నాడు. కోడలు సుకన్య కూడా ఉద్యోగస్తురాలని తెలుసుకొని 'చల్ల నీళ్ళకు వేన్నీళ్ళు' తోడని అనలేదు . కొడుకు బతుకు చల్లగుంటాదిలే అనుకున్నాడు. కొత్త దంపతులు కాస్త పాత పడగానే కొడుకు కోడలు దగ్గరకెళ్ళాడు. తనంతకు తాను కాదు. కొడుకు బలవంతం మీద పల్లె విడచి పట్నం చేరుకున్నాడు. పల్లెను విడచి వెళ్ళేటప్పుడు 'తల్లిని' కోల్పోయినంత బాధ పడ్డాడు. కొడుకు కోడలు దగ్గర కొంతకాలం బతుకు బాగానే సాగింది. ఆ తర్వాత అడ్డం తిరిగింది.

ఇల్లు చక్కగా ఉంది. ఇంట్లో టీ.వీ. ఉంది. రేడియో ఉంది. డి.వి.డి. ప్లేయర్ ఉంది. డైనింగ్ టేబుల్, ఖరీదైన సోఫా, అన్ని హంగులూ ఉన్నాయి. వెంకటాద్రికి తృప్తి లేదు. ఏదో! కోల్పోయిన కొతుకు (లోపం) గుండెలో కొతుకు. గొంతులో కొతుకు. మనసులో కొతుకు. మనిషి అంతా కొతుకే.

సన్న బియ్యం అన్నం ఉంది. ముద్ద పప్పు ఉంది. రసం ఉంది. గడ్డ పెరుగూ, ఆవు నెయ్యి, చికెన్ వేపుడూ, మటన్ బిరియానీ అన్నీ ఉన్నాయి. వెంకటాద్రికి తినబుద్ధి కాలేదు.

ఇరుగు జనం. పొరుగు జనం. ఇంటి ముందు జనం. ఇంటి వెనక జనం. వీధుల నిండా జనమే. మాట్లాడే వాళ్ళు కరవైనారు. ఎవరి పనుల్లో వాళ్ళు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. బయట వాళ్ళు మాట్లాడకపోయినా! కొడుకు కోడలు మాట్లాడితే చాల్లే! వాళ్ళతో తను మాట్లాడితే చాల్లే అనుకున్నాడు. వాళ్ళు 'ఆ' అన్నారు. 'ఊ' అన్నారు. 'అన్నం' తిన్నావా? తింటావా? అన్నారు తప్పా...! మనసుకు దగ్గర కాలేదు. కొడుకు ఇంటికి రాగానే కాసేపు మాట్లాడాలని వెంకటాద్రి చాలాసార్లు ఆశ పడ్డాడు. ''తిని పడుకో పో పాయనా! నాకు పని ఉంది'' అన్నాడు కొడుకు శీనయ్య. ''ఏంది శీనయ్యా! సంగతీ''? అని అడిగితే...''నీ కెందుకూ?'' శీనయ్య కసిరించుకున్నాడు. ''నువన్నా సెప్పమ్మా'' అని కోడలు సుకన్యను అడిగితే... '' నీ కెందుకూ? చెప్పినా నీకు అర్థం కాదులే! ఉడుతకెందుకూ ఊర్లో పెత్తనం'' అంది సుకన్య.

మూగ భాష.

మౌన వ్రతం .... వెంకటాద్రికి దిక్కు తోచలేదు.

''నాయనా! శీనయ్యా! నాకు పొద్దు పోలేదురా. మన ఊరికిపోతా'' అడిగాడు వెంకటాద్రి.

''ఏం? ఎందుకూ? అక్కడ ఉన్న నిధులు దొంగలు ఎత్తుకు పోరులే'' అన్నాడు శీనయ్య.

''ఆ నిధులే ఉంటే మీ డాడీని తాళ్ళతో కట్టి పడేసినా నిలవడు. తెంపుకొని పారిపోయే వాడు. అక్కడికెళ్ళి ఏం భోంచేస్తాడో'' దీర్ఘం తీస్తూ అంది సుకన్య.

వెంకటాద్రికి గుండెను రాయితో గుద్దినట్లు అనిపించింది. మనసును ముళ్ళతో కుచ్చినట్లయింది. నోట్లో సమాధానం లేక మౌనాన్ని కొనసాగించాడు.

రోజులు బరువుగా దొర్లుతున్నాయి. వెంకటాద్రి మౌనవ్రతం కొనసాగుతూనే ఉంది. కొడుకు కోడలు ఆఫీసుకు వెళ్ళగానే ఇంటికి తాళం వేసుకొని రోడ్డు మీదికి వచ్చి నిలబడుతున్నాడు వెంకటాద్రి. వెంకటాద్రి వేష భాషలు చూసి

''కూలీ! వస్తావా? ఈ లగేజీ తీసుకొని వస్తావా'' ఓ షోకిల్లా రాయుడు అడిగాడు.

సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ.

''యాటికి నాయనా'' అడిగాడు వెంకటాద్రి.

''అదిగో! అక్కడ కనిపించే షాపు దగ్గరికి''

''వత్తాను''

''కూలి ఎంత ఇవ్వమంటావు?''

వెంకటాద్రి మాట్లాడలేదు. కూలి రేటు చెప్పలేదు. లగేజీ తీసుకున్నాడు. గడ్డి మోపులు, కట్టెల మోపులు, మూటలు మోసిన అనుభవంతో లగేజీ ఎత్తి నెత్తి మీద పెట్టుకున్నాడు. నాలుగు అడుగులు నడిచాడు. చూసింది పక్కింటి సుచరిత. ''ఏం తాతా! నీ కొడుకు కోడలు నిన్ను కూలికి పంపిస్తున్నారా! ఇద్దరికీ వచ్చే జీతాలు సరిపోలేదంటావా!'' ఎగతాళిగా అంది.

''అయ్యో! వాళ్ళకేమీ తక్కవయిండాది తల్లీ! నాకే పొద్దుపోకా..! ఈడ నిలబడుకొని ఉంటే ఈ యప్ప పిలిసినాడు. ఊరికే ఏంటి కుండల్లలే అనీ... మోసుకొని పోతాండా. నీకు పున్నెం ఉంటాది. మా వాళ్ళకు సెప్పద్దు తల్లీ'' అంటూ ముందుకు సాగాడు.

''ఓల్డ్‌మాన్! ఇదిగో మనీ'' – పది రూపాయలు ఇవ్వబోయాడు లగేజీ యజమాని. వెంకటాద్రి వెనక్కి జరుగుతూ ''డబ్బుల కోసరం మోసుకొని రాలా నాయనా. నువ్వు నాజూగ్గా ఉన్నావు గదా! ఈ బరువు మొయ్యలేవనీ తీసుకొని వచ్చినా'' అన్నాడు వెంకట్రావు. తిరిగి ఇంటికి వచ్చాడు. వస్తూ... వస్తూ ''నా ఊర్లో సేసినట్లే ఈడు గూడ నలుగురికి సాయపడితే నాకు పొద్దు పోతాదిలే'' అనుకున్నాడు.


ఆ రోజు ఆదివారం. సుకన్య ఇంట్లోనే ఉంది. ఏదో పని మీద పక్కింటి సుచరిత దగ్గర కెళ్ళింది. మాటల సందర్భంలో ''మీకేమి లెండి సుకన్య గారు! త్రీశాల రీస్ అంది సుచరిత. వక్రత ధ్వనింప చేస్తూ ''త్రీ శాల రీసా! మీరేమంటున్నారో నాకు అర్థం కాలేదండీ'' చూపులతో క్వొచ్చెన్ మార్కు చెక్కి అడిగింది సుకన్య. వెంకటాద్రి దిన చర్య చెప్పింది సుచరిత. అంతే! సుకన్య ముక్కు పుటాలు అదిరాయి. కళ్ళల్లో ఎర్ర చారలు ఏర్పడ్డాయి. నిప్పుల వాగులా ఇంటికి వచ్చింది. ''నైబర్స్ దగ్గర మా పరువు తీస్తున్నాడు. ఇప్పుడు తమరికి ఏమి తక్కువైందీ? అంత గతిలేక చస్తున్నావా? లేకి బతుకు. దరిద్రం మనిషి'' అంటూ వెంకటాద్రి పైన విరుచుకు పడింది.

''ఏంటి సుకన్యా? ఏంటి విషయం. మానాయన ఇప్పుడు చేసిన తప్పేంటీ?'' శీనయ్య అడిగాడు.

''ఇప్పుడు మూటలు మోస్తూ మనకు సంపాదించి పెడుతున్నాడు. రేపు ముష్టి ఎత్తుకొని వచ్చి మనకు తిండి పెడతాడు'' ముష్టి పదాన్ని నొక్కి చెప్పింది.

''కాస్త అర్థమయ్యేటట్లు చెప్పు సుకన్యా'' – ఆత్రం, ఆశ్చర్యంతో అడిగాడు. జరిగిన సంగతి చెప్పింది. శీనయ్య కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తండ్రిని తదేకంగా చూశాడు. ఆ చూపులో కోపం లేదు. అసహ్యం లేదు. కరుణ ఉంది. గుండె తడిచేసుకొని వెంకటాద్రి ప్రక్కన కూర్చున్నాడు. ''ఇప్పుడు నీకు ఏమి తక్కువైంది నాయనా? ఇన్నాళ్ళూ కష్టపడినావు. ఇప్పుడు సుఖంగా ఉండచ్చు గదా'' తల్లి మనసుతో చెప్పాడు.

''ల్యా! శీనయ్యా. కూలి సెయ్యలా! డబ్బులు తీసు



కోల్యా. మన ఊర్లో సేసినట్లే నలుగురికి సాయం సేత్తాండా'' పసి బిడ్డలా చెప్పాడు.

''ఇక నుంచి నువ్వు రోడ్డు మీదికి వెళ్ళటానికి వీల్లేదు'' అంది సుకన్య. ఆర్డర్ వేసింది. వెంకటాద్రి తల ఊపాడు. శీనయ్య శ్రోత అయ్యాడు.

కోడలు ఆజ్ఞను శిరసా పాటించి రోడ్డు మీదికి పోవటం మానేశాడు వెంకటాద్రి. ఇరుగు పొరుగుతో వాళ్ళకు తీరిక ఉన్నప్పుడు కాలక్షేపం కోసం కబుర్లు చెప్పాడు. ''వంశ చరిత్రలూ, జీవిత చరిత్రలు'' చెప్పాడు. విన్నవారు ఊరకుండ లేదు. వీధికంతా చెప్పారు. ''ఏమండీ సుకన్య గారూ! మీ మామ గారు కట్టెలు కొట్టి, మూటలు మోసీ, కడుపు ఎండ గట్టుకొని మీ వారిని చదివించారటగా! పట్టుదల ఉంటే పేద కూడా రాజు కావచ్చని నిరూపించారు. మీ మామగారు చెప్పిన మాటలన్నీ వ్రాసుకుంటూ పోతే 'పెద్ద కూలి పుస్తకం' అవుతుంది సుమండీ'' – ఇరుగు పొరుగు హేళనగా అన్నారు. ఆ చులకన భావం నుంచి తప్పించుకోవటనాకి పదేళ్ళలో ఎనిమిది అద్దె ఇళ్ళు మారారు. ఎక్కడికి పోయినా ఇదే తంతు కొనసాగటంతో వెంకటాద్రిని కొన్నాళ్ళు ఇంట్లోనే పెట్టి తాళం వేసుకొని పోయారు. ఇక బయటికి పోడులే! ఇక చెప్పుకోవటానికి ఏమి మిగిలిందిలే! అని నమ్మకం కాస్త కుదిరిన తర్వాత ఇంటికి తాళం తొలగించారు. అయినా ''ఎవరితోనూ మాట్లాడ కూడదని ఆంక్షలు విధించారు'' కొడుకు కోడలు.

***

'గతం పుస్తకం'లోని చివరి పుటను జ్ఞాపకాల దొంతరులతో వెంకటాద్రి చదవటం పూర్తి చేసే సమయానికి కొడుకు కోడలు వచ్చారు. వాళ్ళు వచ్చిన కాసేపటికి స్కూల్ కెళ్ళిన మనవడు సుధీర్ వచ్చాడు. ముగ్గురూ మాట్లాడుకున్నారు. సుధీర్ చెప్పిన ముద్దు ముద్దు మాటలు శీనయ్య విన్నాడు. శీనయ్య చెప్పిన మాటలు కళ్ళు పెద్దవి చేసి సుధీర్ విన్నాడు. తండ్రీ కొడుకుల మాటలతో శృతి కలుపుతూ సుకన్య మాట్లాడింది. ముగ్గురూ మధ్య మధ్యలో ఆనందంగా నవ్వుకున్నారు. ''వాళ్ళ మాటలూ, ఆ నవ్వులూ'' వెంకటాద్రి మౌనంగా విన్నాడు.

చీకటి పరచుకుంది. దాన్ని తొలగించుకొని వెలుతురు కూడా వచ్చింది. సోఫాలో కూర్చొని టీ.వి. చూస్తున్న శీనయ్య దగ్గరకు వచ్చాడు వెంకటాద్రి.

''టిఫిన్ తినుపో నాయనా'' శీనయ్య అన్నాడు.

''తిందురా మామా'' సుకన్య అంది.

''వద్దు'' తల అడ్డంగా ఊపుతూ వెంకటాద్రి ఇద్దరికీ సమాధానం చెప్పాడు.

''మరేమిటి?'' అన్నట్లు చూశాడు శీనయ్య.

''నేను 'మా' ఊరికి పోతా'' – స్థిరంగా చెప్పాడు వెంకటాద్రి.

''అక్కడికి పోయి ఏమి చేస్తావూ?''

''బతుకుతా''

''ఇప్పుడు చచ్చిపోయినావా'' – కాస్త కోపంగా అన్నాడు శీనయ్య. వెంకటాద్రి మాట్లాడలేదు. మౌనంగానే నిలబడుకున్నాడు.

''అది కాదు నాయనా'' ఏదో చెప్పబోయాడు శీనయ్య,

''వద్దు! నన్ను మాట్లానీరా''

''చెప్పు'' అన్నట్లు చూశాడు శీనయ్య.

''నిన్ను ఒకసారి దసరా పండగ నాడు హరికత కాటి తీసుకొని పోయింటి గుర్తు ఉండాదా?''

''ఊ! ఉంది''

''హరిదాసు! హరికతలో పిట్టకత సెప్పుతూ కామం (కోరిక) మూడు రకాలుగా ఉంటాది. దోగాడే పసి బిడ్లకు మోకాళ్ళలో ఉంటాది. ఇడిత్తే పరిగెత్తాలని సూత్తారు. వయసులో ఉండే వాళ్ళకు 'నడుం'లో ఉంటాది. ఆడ–మగ సుకం కోసరం కోర్కెలు గుర్రాలు మాదిరి పరిగెత్తు తాయి. ఇక ముసిలోళ్ళకు కామం 'నోట్లో' ఉంటాది. సందు సిక్కితే సాలు మాట్లాడాలని సూత్తారు. ఇప్పుడు నేను ముసిలోన్ని గద నాయనా! నా కొడుకుతో, నా కోడలితో, నా మనవనితో నోరారా మాట్లాడాలని కోరిక ఉంటాది. నా కట్టం, నా సెమట, ఆ సెమటతో ఎదిగిన నిన్ను గురించీ, నీకు జత కుదిర్చిన నా కోడలి గురించి, నలుగురికీ సెప్పుకొని సంతోస పడాలని నాకు ఆశగా ఉంటాది. కానీ... కానీ... మీరు... మీరు నా నోరు నొక్కేసినారు. నా మనసు పిసికేసి నారు. నా కాలు సెయ్యి విరిసేసినారు. నన్ను 'సిలుం' పట్టిన ఇనుప వస్తువును సేసినారు. నాయనా! శీనయ్యా! హరిదాసు మూడు రకాల 'కామం' సంగతే చెప్పినాడు. ఇప్పుడు నేను నాల్గో రకం కామం గురించి సెప్పుతా ఇను. కట్టజీవి సెమట బొట్టులో కూడా కామం ఉంటాది. బొందిలో ఊపిరి ఉన్నంతకాలమూ అది పని సేయాలనుకుంటాది. పని సేత్తా... సేత్తానే పాణం ఇడసాలనుకుంటాది. నా కాలూ, సెయ్యి ఇంగా పడిపోలా. అంతో! ఇంతో ఆడ తాండాయి. నా ఊరికి పోతా. నన్ను కనీ, సాకిన నా తల్లి కాటికిపోతా. యాదో ఒగ పని సేసుకుంటూ.

నలుగురితో మాట్లాడుకుంటూ బతుకుతా – అంటూ చేతి సంచి తీసుకొని గుమ్మం దగ్గరకొచ్చాడు వెంకటాద్రి. వెంకటాద్రి బయలు దేరటం చూసీ.... ''తాతయ్యా! మళ్ళీ ఎప్పుడొస్తావు'' – అంటూ మనవడు సుధీర్ అల్లుకు పోయాడు.

''చెప్పు! వాడు అడుగుతున్నాడు గదా'' అన్నాడు శీనయ్య. తండ్రిని పంపటం ఇష్టం లేక.

''వానికి కాదు. మల్లా నీకే సెపుతాండా ఇను నాయనా! నీకూ ఒక కొడుకు ఉన్నాడు. పెరిగి పెద్దవాడు అవుతాడు. ఇప్పుడు నువ్వు వయసులో ఉన్నావు. అప్పటికి ముసలి వాడవుతావు. నా కట్టం నీకు రాకుండా సూసుకో తండ్రీ. ఇవి శాపం కాదు బిడ్డా! ఈ తండ్రి ఇచ్చే వరం అనుకో'' అంటూ ఇంటి గుమ్మం దాటాడు వెంకటాద్రి.

''ఉండు నాయనా! బండిలో డ్రాప్ చేస్తా! బస్సు ఎక్కిస్తా'' – శీనయ్య అచేతనంగా అన్నాడు.

''వద్దు శీనయ్యా! నేను నడసక శానకాలమైయిండాది'' అన్నాడు వెంకటాద్రి. గేటు తీసుకొని బయటికి వచ్చాడు. రోడ్డు మీదికి వచ్చాడు. జనంలోకి వచ్చాడు. మనుషుల్లోకి వచ్చాడు. ఇరుకు గదిలో నుంచి, విశాలమైన ప్రపంచంలోకి వచ్చాడు. వస్తూ... వస్తూ ''నాకిప్పుడు మాటొచ్చినాయి. కాళ్ళొచ్చినాయి. రెక్కలొచ్చినాయి'' అనుకున్నాడు. గట్టిగా మాట్లాడుకున్నాడు. ఒంట్లో సత్తువనంతా కాళ్ళల్లోకి కూడ దీసుకొని 'అడుగులు పార చాపుతూ' సాగే పొద్దులాగా, వీచే గాలిలాగా, ఎగిరే పక్షి లాగా ముందుకు నడిచాడు.

*


చిరునామా:
డా. వి.పోతన్న, ఎం.ఎ. పిహెచ్‌డి.
ఇంటి నెం.80/11-131-హెచ్ఐజి-1
ఎపి హౌసింగ్ బోర్డు కాలనీ,
అబ్బాస్ నగర్, కర్నూలు – 518 002
సెల్ : 9440351118




## తమిళంలో అనుష్క బిజీబిజీ...

'అరుంధతి'గా సినీప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న అనుష్క తన దృష్టిని తిరిగి తమిళ తెర మీదకు మళ్లించింది. తమిళంలో 'రెండు' తరువాత నెమ్మదిగా తమిళ సినిమాలను తగ్గించుకొని టాలీవుడ్ వైపు దృష్టి సారించింది. 'అరుంధతి'కి ముందు అనుష్క నటించిన సినిమాలు ఆమెకు పెద్ద పేరును తీసుకురాలేకపోయాయి. 'అరుంధతి' తరువాత ఆమె వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం లేకపోయింది. ఇప్పటికే తెలుగులో పలువురు అగ్రహీరోల పక్కన నటిస్తున్న అనుష్క తమిళంలో కూడా మూడు సినిమాలను అంగీకరించింది. ఒక దానిలో పల్లెటూరి అమ్మాయిగా నటిస్తోంది. మరో సినిమాలో తన ఇంట్రడక్షనే ఆసక్తికరంగా ఉంటుందని, ఇంతవరకూ అలాంటి సన్నివేశంలో నటించలేదని అంటోంది. మొత్తానికి ఈ మూడు సినిమాలు తనకు మంచి పేరునే తెచ్చిపెడతాయన్న ధీమాను ఆమె వ్యక్తం చేస్తోంది.